


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అత్తగారు - కొత్త కోడలు

**ఫోన్ మోగింది.** ఆ ఆదివారం సాయంత్రం తీరిగ్గా కూర్చుని స్వరాభిషేకం చూస్తున్న వసంత ఎవరా అని చూసింది. సంజన. ఫోన్ ఆన్ చేసి చెప్పింది.

"హలో డాలీ. గుడ్‌మార్నింగ్. వీకెండ్ కూడా త్వరగా లేచేసావే?"

"అసలు పడుకుంటే కదా లేవడానికి."

"అదేంటి? ఏమైంది?" వసంత కంగారు పడింది.

"అమ్మా నేను టూ వీక్స్ నుంచి ఆలోచించి ఓ నిర్ణయం తీసుకున్నాను. వింటున్నావా?"

"వింటున్నా చెప్పు" వసంత అనుమానంగా అడిగింది.

"నేను, ప్రభు పెళ్ళి చేసుకుందాం అనుకుంటున్నాం. ఫైనల్లీ ఇవాళ వాళ్ళ పేరెంట్స్‌కి, మీకు చెప్దామని డిసైడ్ అయ్యాం. ఏమంటావ్?"

దాదాపుగా ఏడాది నుంచి వసంత ఈ విషయం అనుమానిస్తూనే ఉంది. ముఖ్యంగా ఆరునెలలక్రితం సంజన గ్రాడ్యుయేషన్ సెర్మనీకి వెళ్ళినప్పుడు వాళ్ళ మధ్యగల చనువు, వాళ్ళ బాడీ లాంగ్వేజ్ చూడగానే వాళ్ళిద్దరూ కేవలం ఫ్రెండ్స్ కాదని ఆమెకి అర్థమైంది. ఎదురు చూసిన బాంబు నెత్తిన పడనే పడింది.

"నాన్న వాకింగ్‌కి వెళ్ళారు. ఓ అరగంట తర్వాత కాల్ చేస్తావా?" అడిగింది.

"నో. నాన్నతో నేను చెప్పను. నువ్వే చెప్పు. ఒప్పించు. అంతే." సంజన కంగారుగా చెప్పింది.

"అంటే నీ తిట్లు నేను తినాలన్నమాట."

"ఎందుకమ్మా తిట్టడం? ప్రభూకి ఏం తక్కువ? వాళ్ళు మనకన్నా రిచ్‌వాళ్ళు తెలుసా? అసలు నువ్వు ఏదో మాములు విషయం విన్నట్లుగా ఉంటావేం? కంగ్రాట్స్ చెప్పవా? నీ ఏకైక కూతురు పెళ్ళిచేసుకుంటాను అంటోంది" సంజన కోపంగా అరిచింది.

"డాలీ. ప్రభాత్ వాళ్ళు ఎవరు?" వసంత జంకుతూనే అడిగింది.

"ఎవరు? ఏంటా ప్రశ్న? మనుషులు."

"అబ్బా! అదే డాలీ వాళ్ళ కులం?"

"అమ్మా! ఛీ! ఈ రోజుదాకా నేనా ప్రశ్న అడగలేదు తెలుసా! ఇంకా కులాలు మతాలు ఏంటమ్మా? వాళ్ళు హిందువులే."

"పేరుని బట్టి అర్ధమైంది డాలీ. స్నేహానికి కులం అక్కర్లేదు. కానీ పెళ్ళికి కావాలిగా?" వసంత అనునయంగా అడిగింది.

"పెళ్ళికి కూడా అక్కర్లేదు. 'నీకులమేంటి' అని అడిగితే అసహ్యంగా ఉంటుంది. నాన్న రాగానే చెప్పు. కాస్త ఆనందంగా ఉండండమ్మా" టక్కున ఫోన్ కట్ చేసింది సంజన.

వసంత అలాగే కూర్చుండిపోయింది. సంజన మనస్థత్వం ఆమెకి బాగా తెలుసు. తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళు అనేరకం. భర్తని ఎలా ఒప్పించాలా అని ఆమెకి భయంగా ఉంది.

ఆ రాత్రి భోజనాల తర్వాత నెమ్మదిగా ఆయనకి సంజన ఫోన్‌లో చెప్పిన విషయం చెప్పింది.

"మనం అమెరికా వెళ్ళినప్పుడే ఊహించాను వసూ. ప్రభాత్ మంచబ్బాయే. ప్రొసీడ్ అవుదాం" ఆయన నిదానంగా చెప్పాడు.

అప్పటికి వసంతకి కొంచెం ఊరటగా అనిపించింది.

అరగంట తర్వాత సంజన నుంచి ఫోన్.

"నీకంటే నాన్నే నయం. కంగ్రాట్స్ అని ఇ మెయిల్ పంపారు." నిష్టూరంగా చెప్పింది.

"డాలీ! ప్రభాత్ వాళ్ళ పేరెంట్స్ ఏమన్నారట?" వసంత అదేమీ పట్టించుకోకుండా అడిగింది.

"వాళ్ళూ ఓకే అన్నారట. ఈ సంజనని వద్దనడానికి వాళ్ళకి ఏ రీజన్ లేదు." గర్వంగా చెప్పింది.

"సరే. వాళ్ళ ఫోన్ నంబర్లు నాన్నకి ఇవ్వు. ఆడపిల్లవాళ్ళం కదా. ఫార్మల్‌గా మాట్లాడి ముహూర్తాలు పెట్టుకుంటాం. ఇంతకీ మీరు పెళ్ళెప్పుడు చేసుకోవాలని డిసైడ్ అయ్యారు?" కొంచెం వ్యంగ్యంగా అడిగింది.

"డిసెంబర్ ఆర్ జాన్."

"జాన్ సారీ జనవరి కుదరదులే ధనుర్మాసం. డిసెంబర్‌లో ముహూర్తాలు చూడమంటావా?"

"ఓ.కే. ఒక ఐదారు పెట్టించు. మాకు ఏ డేట్ వీలుగా ఉంటే అది చెప్తాం." సంజన ఫోన్ పెట్టేసింది.

అలాంటి ఇబ్బందికరమైన పరిస్థితుల్లోకి నెట్టినందుకు ఆ రోజంతా కూతుర్ని తిట్టుకుంటూనే ఉంది వసంత. మధ్యాహ్నం ప్రభాత్ ఇంటికి వెళ్ళారు భార్యాభర్తలిద్దరూ. తమలాగే వాళ్ళు విధిలేక ఒప్పుకున్నారేమో అనిపించింది. వీళ్ళు ఉన్న అరగంటలో ఆయన చేతిలోంచి ఫోన్ తీయలేదు. ఆవిడ కూర్చున్న చోటినుంచి లేవలేదు. ఇక విసుగేసి అడిగింది.

"ముహూర్తాలు పెట్టించడానికి ప్రభాత్ నక్షత్రం చెప్తారా? వాళ్ళకి డిసెంబర్ వీలుట"

"అశ్విని" తల్లి చెప్పింది.

"రేవతి అనుకుంటా?" ఫోన్‌లో మాట్లాడుతూనే తండ్రి చెప్పాడు.

"కాదు అశ్వినే. ఐదారు ముహూర్తాలు పెట్టించి కాల్ చేసి చెప్పండి. మాకు సూట్ అయ్యేది డిసైడ్ చేసుకుని చెప్తాం." ఆవిడ చెప్పింది.

"అమ్మయ్యా! ఇంటికి వచ్చి చెప్పమనలేదు అదృష్టం" అనుకుంది వసంత.

"అమ్మా ఇవాళ నేను కేప్సికమ్ కర్రీ చేసాను తెలుసా!? దీపాంటీ చెప్పినట్లే చేసా. టేస్టీగా ఉందిలే." సంజన హుషారుగా చెప్పింది.

"దీపాంటీనా? ఆవిడెవరు?" తెల్లపోయింది వసంత.

"ప్రభూ వాళ్ళ మమ్మీ అమ్మా. ఆంటీతో మాట్లాడుతూంటాలే."

"ఓహ్! గుడ్" వసంతకి మనసు చివుక్కుమంది ఎందుకో.

ఇండియాలో ఉన్నంతకాలం సంజనకి మగ, ఆడ ఫ్రెండ్స్ సమానంగా ఉండేవారు. కానీ ఎవరిమీదా ప్రత్యేక ఆసక్తి ఉండేదికాదు. అమెరికాకి యం.ఎస్‌కి వెళ్ళిన కొత్తల్లో దిగులు, దుఃఖం, భయంలాంటి ప్రతికూల పరిస్థితుల్లో పరిచయమైన ప్రభాత్ మాత్రం ఆమెకి చాలా దగ్గరయాడు. ఉద్యోగాలు కూడా ఒకే ఊళ్ళో రావడంతో ఇక ఇద్దరికీ చెరో అపార్ట్‌మెంట్ వేస్ట్, పెళ్ళిచేసుకుంటే సరి అనుకున్నామని సంజన చెప్పింది.

ఇప్పుడు సంజన కూర ఎలా చేయాలి అని తనని అడక్కుండా కాబోయే అత్తగారిని అడగడం వసంతకి బాధగా ఉంది.

ఇల్లల్ని రిసీవ్ చేసుకోడానికి ఏర్‌పోర్ట్‌కి వెళ్ళిన వసంత దూరం నుంచీ ట్రాలీ తోసుకు వచ్చే సంజనని చూసి ఆశ్చర్యపోయింది. ఎప్పుడు వచ్చినా ఓ పిచ్చి నిక్కర్, దానిమీద వెలిసిపోయిన టీ షర్ట్, పిచ్చిక గూడులాంటి జుట్టుతో కనిపించే సంజన మంచి పేంట్, దానిమీద కుర్తా వేసుకుని జుట్టుకి క్లిప్ పెట్టింది. నుదుటి మీద చిన్న బొట్టుకూడా పెట్టింది.

"నమస్తే ఆంటీ. అంకుల్ కులాసానా?" వెనకే వచ్చిన ప్రభు విష్ చేసాడు.

"నమస్తే బాబూ. మా డాలీని పూర్తిగా మార్చేశావ్" వసంత మెచ్చుకోలుగా చెప్పింది.

ప్రభాత్ తల్లితండ్రులు ఏర్‌పోర్టుకి రాలేదు. డ్రైవర్ వచ్చాడు. బై చెప్పి ప్రభాత్ అతనితో వెళ్ళిపోయాడు.

దారిపొడుగునా సంజన ఉత్సాహంగా పెళ్ళి కబుర్లు చెప్తూ, మధ్య మధ్యలో ఛ ఛ అనడం విని వసంత అడిగింది.

"ఏమైంది డాలీ. లగేజ్ అంతా సరిగ్గానే వచ్చిందిగా?"

"అదికాదమ్మా. దీపాంటీ వాళ్ళు ఏర్‌పోర్ట్‌కి వస్తారేమో అని దుబాయ్‌లో బాగా తయారయ్యాను. ఫుల్‌పేంట్ వేసుకున్నాను. మేకప్ వేసుకున్నాను. కానీ వాళ్ళు ఏర్‌పోర్ట్‌కి రాలేదు. మీరు ప్రభూని యు.ఎస్‌లో చూసారు కానీ వాళ్ళు నన్ను ఇంతదాకా చూడలేదు కదా" నిరాశగా చెప్పింది.

"వాళ్ళకేం పనులున్నాయో."

"అమ్మా. నువ్వు మరీ సర్కాస్టిక్‌గా మాట్లాడుతున్నావ్. అర్ధరాత్రి రెండింటికి ఏం పనులుంటాయ్?" గయ్యిమని అరిచింది.

"ఓకే.. ఓకే కూల్." తండ్రి సముదాయించాడు.

ఇంటికి వచ్చాక ఆయన వెళ్ళి పడుకుంటే తల్లీ కూతుళ్ళు ఇద్దరూ కూర్చుని కబుర్లు చెప్పుకోసాగారు. సంజన సూట్‌కేస్ తీసి పెద్ద ఎర్రబేగ్ బయటికి తీసింది. అందంగా ఉన్నదాన్ని చూసి సంజన చేతిలోంచి లాక్కుని వసంత చెప్పింది.

"ఎంత బావుందో. నీ సెలక్షన్ సూపర్ డాలీ."

"సారీ అమ్మా. అది నీకోసం కాదు. దీపాంటీకి." తల్లి చేతిలోంచి తీసుకుని దాని జిప్ తీసి లోపలనుంచి ఒకొక్కటి బయటకి తీసింది. మేకప్ కిట్, ఐఫోన్, రకరకాల షేడ్స్‌లో లిప్‌స్టిక్స్, నెయిల్ పాలిష్‌లు, రోజ్ గోల్డ్ వాచ్..

"ఇవన్నీ ఆవిడకేనా?"

"అవును. అంకుల్ కోసం ఫిట్‌బిట్ తీసుకున్నాను. ఇవి మనకి" టీబేగ్స్, చాక్లెట్స్, స్టీవియా పేకెట్స్. వాటిని తీసుకెళ్ళి కిచెన్‌లో సర్దివచ్చింది.

"ప్రభూ నాకోసం ఏం కొన్నాడు డాలీ?" ఆసక్తిగా అడిగింది.

"ఏమీ కొనలేదనుకుంట?" అనేసింది.

"అమ్మా! అమ్మోయ్" సంజన నించి ఫోన్.

పెళ్ళయి అమెరికా వెళ్ళాక ఫోన్స్ తగ్గిపోయాయి. 'మళ్ళీ ఇదేమిటీ ఈ పిల్ల ఇలా అరుస్తోంది?' వసంత కంగారు పడుతూ అడిగింది.

"హాఁ! ప్రభువాళ్ళ మమ్మీ యు.ఎస్ వస్తున్నారట ఈ ఫిఫ్టీన్త్‌కి"

"ఓ! గుడ్ మంచిదేగా? నీకేమైనా కావాలా ఇక్కడి నుంచి? ఆవిడకిచ్చి పంపనా?" అడిగింది.

"కాదు. పెళ్ళయి ఆర్నెల్లేగా అయింది. ఈవిడిప్పుడు రావడం అవసరమా?"

"అదేం ప్రశ్న? వాళ్ళ కొడుకు ఇంటికి వాళ్ళు ఎప్పుడైనా వెళ్ళొచ్చు"

"హలో! ఇంటి రెంట్ నేను కడుతున్నాను."

"నువ్వా వాళ్ళ కోడలివేగా? ఇంతకీ ఎన్నిరోజులుంటారుట?"

"ఒన్ మంత్"

"ఒక్కనెల రోజుల కోసం అలా తల్లకిందులవుతావు ఎందుకు డాలీ. చక్కగా ప్రేమగా చూసుకుని పంపించండి."

"మహాతల్లీ నీకు చెప్పాను చూడు. నీతులు మొదలుపెడతావ్" కోపంగా ఫోన్ పెట్టేసింది.

అత్తగార్ని రిసీవ్ చేసుకున్నాక ఎయిర్‌పోర్ట్‌లో తీసుకున్న సెల్ఫీని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది సంజన. అది చూసి చిన్నగా నిట్టూర్చింది వసంత. ఎప్పటిలానే పొట్టి నిక్కర్, వెలిసిపోయిన టీషర్ట్, పిచ్చిక గూడులాంటి జుట్టు.

"అమ్మా! ప్రభు వాళ్ళ మమ్మీ పొద్దున తిన్నవి రాత్రి తినదుట. నేను వారం రోజుల నాటివి కూడా తింటాను. నిన్న ఆఫీస్ నుంచి వచ్చేసరికి ఫ్రిజ్‌లోని లెఫ్ట్ ఓవర్స్ అన్నీ డస్ట్‌బిన్ లో పారేసింది."

"అమ్మా! రోజూ నాకు ప్రభూనే కాఫీ కలిపి ఇస్తాడు కదా. వాళ్ళమ్మకి అది నచ్చలేదుట. 'నువ్వు కలుపుకో. లేకపోతే కాఫీ మానెయ్ ఆరోగ్యం' అంది నన్ను."

"అమ్మా! ఇవాళ వాళ్ళు మ్యూజియంకి వెళ్ళారు. నేను రానన్నాను. ఆవిడతో చిరాకు. వాళ్ళబ్బాయ్‌ని ముట్టుకోవద్దు అంటుంది."

ప్రతీరోజు ఆఫీస్‌కి వెళ్ళేప్పుడు ఏదో కంప్లయింట్ చెప్తూనే ఉంది సంజన. వసంత ఓరోజు అడిగింది.

"ఔను డాలీ, దీపాంటీ ప్రభూ వాళ్ళమ్మ ఎప్పుడైంది?"

"అదిప్పుడు నీకు అవసరమా? నువ్వెప్పుడూ ఇంతే. సర్కాస్టిక్‌గా మాట్లాడతావ్ ఛీ." కోపంగా ఫోన్ పెట్టేసింది సంజన.

తర్వాత రెండు రోజులు ఫోన్ చేయలేదు. మూడోరోజు మళ్ళీ మొదలు ప్రభాత్‌ని తలుచుకుని తెగజాలి పడిపోయింది వసంత. పాపం తల్లీ పెళ్ళాల మధ్య ఎంత నలిగి పోతున్నాడో. ఇద్దరూ ఇద్దరే. కరవమంటే కప్పకి కోపం, విడవమంటే పాముకి కోపం.

"అమ్మా! నా చెప్పులు చూసి ఆవిడ వాళ్ళ కొడుకుతో పది జతలు కొనిపించుకుంది. 'నా వన్నీ పెళ్ళికి ముందు నేను కొనుక్కున్నవే. మీ అబ్బాయేం కొనివ్వలేదు' అని చెప్పాను. ఇంకా ఫిఫ్టీన్ డేస్. పదిహేను రోజులు. ఈవిడతో ఎలా వేగాలో తెలియడం లేదు." ఓ రోజు వాపోయింది సంజన.

"నేను చెప్పనా? మరి కోపం తెచ్చుకో కూడదు."

"లేదు. కోపం లేదు ఏం లేదు చెప్పు."

"ఆర్నెల్లు వెనక్కి వెళ్ళు. నువ్వు ప్రేమించినవాడి పేరెంట్స్ నిన్ను ఒప్పుకుంటారో లేదో అని భయపడ్డావు చూడు. ఆ కాలంకి వెళ్ళు. వాళ్ళని ఇంప్రెస్ చేయడానికి గిఫ్ట్స్ తేవడం, ఫోన్ చేసి రెసిపీలు అడగడం, ఇంకా సంప్రదాయంగా తయారవడం అన్నీ గుర్తు తెచ్చుకో. నీకు, ప్రభుకి ఇంకా పెళ్ళికాలేదు ప్రభు వాళ్ళ అమ్మ యు.ఎస్ వచ్చారు. ఆవిడని ఇంప్రెస్ చేయాలి అనే కోణంలో ఆలోచించి ప్రవర్తించు.."

వసంత చెప్తూ ఉండగానే అవతలనుంచి కాల్ కట్ అయింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story